క్లుప్తంగా

అనాథ బాలికలకు అండగా..



సాయాన్ని అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

వజ్రపుకొత్తూరు: మండలానికి చెందిన హాండ్స్ టుగెదర్ ట్రస్ట్ సభ్యులు ఔదర్యాన్ని చాటుకున్నారు. పలాస మండలం సూదికొండ గ్రామానికి చెందిన ముగ్గురు బాలికలు అనాథలుగా ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న ట్రస్టు సభ్యులు రూ. 21 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని బాలికలకు సోమవారం అందజేసి అండగా నిలిచారు. ట్రస్ట్ సభ్యులు ఆదినారాయణ, కూర్మారావు, కోదండరావు, గణపతి, గౌరీ, సౌందర్య ఉన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



నృత్య ప్రదర్శనలో చిన్నారులు

నందిగాం: పెంటూరు గ్రామ శివాలయం, శ్రీవల్లీ దేవ సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద ఆదివారం రాత్రి చిన్నారులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆలయ ధర్మకర్త అట్టాడ ఠాగూర్ ఆధ్వర్యంలో టెక్కలికి చెందిన పీఈటీ కేశవ డ్యాన్స్ అకాడమీ చిన్నారులు భరత నాట్యంతో పాటు పలు భక్తి, దేశ భక్తి పాటలకు నృత్యంతో అలరించారు. అనంతరం భజన బృంద సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో తెంబూరు మాధవరావు, అట్టాడ సింహాద్రి అప్పనాయుడు, బొడ్డ నారాయణరావు, జడా నారాయణ రావు, తెంబూరు కంచయ్య, రామయ్య, బాలక శంకరరావు, వైకుంఠరావు, తెంబ ఊరు కోదండరావు ఉన్నారు.

త్వరలో పూడిలంక రోడ్డు పనులు

వజ్రపుకొత్తూరు: పూడిలంక గ్రామానికి రోడ్డు నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానున్నయని మాజీ ఎంపీపీలు సూరాడ మోహనరావు, గిరకల వసంతరావు చెప్పారు. సోమవారం రోడ్డును పరిశీలించి గ్రామస్తుతో మాట్లాడారు. ఉపాధి హామీ పథకం నిధులు రూ.3.88 కోట్లతో రోడ్డు పనులు చేపట్టేందుకు ఎమ్మెల్యే గౌతు శిరీష చర్యలు తీసుకున్నారన్నారు. త్వరలోనే ఎమ్మెల్యే రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. మాజీ సర్పంచ్ తిమ్మల క్రిష్టారావు, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, టీడీపీ నాయకులు కర్ని రమణ, గోవింద పాపారావు, దున్న షణ్ముఖరావు ఉన్నారు.

నాణ్యతలేని రోడ్లు వేశారని ఫిర్యాదు



జేసీకి ఫిర్యాదు చేస్తున్న చేస్తున్న నీలాద్రి రెడ్డి

ఇచ్ఛాపురం రూరల్: పల్లె పండుగ పేరుతో తమ గ్రామానికి సుమారు రూ. మూడు లక్షలతో నాణ్యత లేని నాసిరకం రోడ్డు వేశారని అరకబద్ర గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో గ్రామస్తుల తరపున బింగి నీలాద్రిరెడ్డి జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. రోడ్డు వేసిన కొన్ని రోజులకే రాళ్లు తేలిపోయి శిథిలావస్థకు చేరుకుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. జేసీ సానుకూలంగా స్పందించి విచారణ చేస్తామని హామీ ఇచ్చారని నీలాద్రి తెలిపారు.

నీడ కరువాయే..!

- కానరాని బస్ షెల్టర్లు
- అవస్థలు ఎదుర్కొంటున్న ప్రయాణికులు

నందిగాం:

నందిగాం మండల పరిధిలో నర్సిపురం నుంచి పెద్దబాణాపురం వరకు 21 కిలో మీటర్లు జాతీయ రహదారి విస్తరించి ఉంది. మండలంలో సుమారు 112 రెవెన్యూ గ్రామాలు ఉండగా ఆయా గ్రామాల ప్రజలు వివిధ పనుల కోసం మండల కేంద్రానికి, టెక్కలి, పలాస తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు జాతీయ రహదారికి చేరుకొని బస్ కోసం వేచి ఉండాలి. అయితే ప్రధాన కూడళ్లలో షెల్టర్లు లేకపోవడంతో ఎండకు, వానకు ఆరుబయటే వేసి ఉండే పరిస్థితి నెలకొని ఉంది. ఒకటి రెండు షెల్టర్లు ఉన్నప్పటికీ అవి శిథిలావస్థకు చేరి వినియోగించడానికి పనికి రాకుండా పోయాయి. పాత్రునివలస, సవరబాణాపురం, ఆనందపురం గ్రామాల ప్రయాణికుల కోసం గతంలో పాత్రునివలస వద్ద షెల్టర్ నిర్మించారు. అయితే అది ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. అలాగే బడగాం, కాశీరాజుకాశీపురం, అగర్లగోకర్లపల్లి, పంతులపేట, వజ్జీలపేట, భోరుభద్ర, వెంకన్నపేట, మాదిగాపురం తదితర గ్రామస్తులు వివిధ ప్రాంతాలక వెళ్లేందుకు తురకలకోట కూడలి వద్దకు చేరుకుంటారు. కానీ అక్కడ ఎలాంటి షెల్టర్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే మండలంలోని మరో ప్రధాన కూడలైన లట్టిగాం వద్దకు హరిదాసుపురం, క్రిష్ణరాయపురం, కంచూరు, కామధేనువు గ్రామాల ప్రజలు వస్తుంటారు. అయినా లట్టిగాం వద్ద షెల్టర్ లేదు. అలాగే మండల కేంద్రమైన నందిగాంకు నిత్యం వందలాది మంది వివిధ పనులు కోసం వస్తుపోతుంటారు. కానీ నందిగాంలో కూడా బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు దుకాణాల వద్ద బస్‌ల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకుంది. కొండల ప్రాంతానికి ముఖద్వారమైన పెద్ద తామరాపల్లి కూడలిలో బస్ షెల్టర్ లేకపోవడంతో పెద్దతామరాపల్లి, చిన్న తామరాపల్లి, పోతులూరు, కర్లపూడి, పద్మాపురం, బెల్లుకొల, భైరిబొడ్డపాడు, రధజనబొడ్డపాడు, సవరనీలాపురం, నౌగాం, కైజోల, కల్లాడ, సవర రామక్రిష్టాపురం,హర్షబడ తదితర గ్రామాల ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. గొల్లూరుకు వచ్చే సొంఠినూరు, చిన్నారి గొకర్లపల్లి, రాంపురం, చిన్న లక్ష్మీపురం, జయపురం , గ్రామాల ప్రజలకు ఎండలో నిరీక్షణ తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించి అవసరమైన చోట్ల షెటర్లు నిర్మించి ప్రయాణికుల కష్టాలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.



నందిగాంలో బస్ కోసం ఎండలో వేచి ఉన్న ప్రయాణికులు



అసంపూర్తిగా ఉన్న నర్సిపురం షెల్టర్ వద్ద ప్రజలు

షెల్టర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి



ప్రధాన కూడళ్లలో ప్రయాణికుల అవస్థలు తప్పేలా నాయకులు, అధికారులు షెల్టర్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి. వేసవి కాలంలో ఎండలో, వర్షాకాలం వానలో ఉండి బస్‌ల కోసం ఎదురు చూడవలసి వస్తుంది. ప్రతి కూడలికి నిత్యం వందలాది మంది వస్తూ బస్‌ల కోసం అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి షెల్టర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.

– పిన్నింటి శ్రీధర్, నందిగాం.

ఆదాయం బట్టి నిర్మాణం చేపడతాం

పంచాయతీల ఆదాయాన్ని అనుసరించి జాతీయ రహదారి సమీపంలో బస్ షెల్టర్ల నిర్మాణం చేపట్టవచ్చు. అయితే హైవేకు దగ్గరగా పంచాయతీ స్థలం ఉండాలి. నందిగాం మండల పరిధిలో అనుకూలంగా ఉన్న కూడళ్ల వద్ద శాశ్వత నిర్మాణం ప్రాతిపదికన బస్ షెల్టర్ల ఏర్పాటుకు చర్యలు చేపడతాం.

– గోపీబాల, డివిజన్ లెవల్ పంచాయతీ అధికారి

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

పలాస: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని బ్రాహ్మణతర్లా హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎస్వీ రమణరావు అన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం వినూత్న రీతిలో ప్రచారం చేశారు. పిల్లల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ విధానాన్ని వివరించారు. బ్రాహ్మణతర్లా జంగం చెరువులో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులను అవగాహన కల్పించి ప్రభుత్వ పాఠశాలలోనే పిల్లలను చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలలో అమలవుతున్న సంక్షేమం, వసతులను వివరించారు. ఉపాధ్యాయులు కొయ్యల శ్రీనివాసరావు, ఎ.మధుబాబు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

డైలీ మార్కెట్ పరిశీలన

ఇచ్ఛాపురం: స్థానిక డైలీ మార్కెట్‌ను మున్సిపల్ జిల్లా అధికారులు సోమవారం పరిశీలించారు. 'ఎక్కడి సమస్యలు అక్కడే'శీర్షికతో ఈ నెల నాలుగో తేదీన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. ఈ మేరకు మార్కెట్ అభివృద్ధి నిమిత్తం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుగుణాకర్ డైలీ మార్కెట్‌ని సందర్శించి శిథిలావస్థకు చేరిన షాపులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మరుగుదొడ్ల ఏర్పాటుతోపాటు ఇతర మౌలిక సదుపాయాలను కల్పించి మార్కెట్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. పట్టణంలోని సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను కూడా పరిశీలించారు. పూర్తివివరాలు అందజేస్తే ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్‌కు సూచించారు.

సాక్షి ఎఫెక్ట్...



మార్కెట్‌ను పరిశీలిస్తున్న ఈఈ సుగుణాకర్

దుకాణాల కేటాయింపులో తాత్సారం

టెక్కలి: టెక్కలి చిన్నబజారులో నిర్మాణం చేసిన మార్కెట్ సముదాయాన్ని ప్రారంభించినప్పటికీ అయా దుకాణాల కేటాయింపులో తాత్సారం చోటు చేసుకోవడంపై భిన్నమైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సుమారు 40 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన మార్కెట్ సముదాయాన్ని పలు పర్యాయాలు ప్రారంభించినప్పటికీ కేటాయింపు విషయంలో ఆశల పల్లకిగా మారుతోంది. దుకాణాల కేటాయింపు విషయంలో గతంలో ఉన్న టువంటి వ్యాపారస్తులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి ఆ తరువాత బహిరంగ వేలం వేయాలని కొంతమంది తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. అయితే దుకాణాల కేటాయింపులో రాజకీయ ప్రమేయం లేకుండా అర్హత కలిగిన వారికి అందజేయాలని వ్యాపారస్తులు కోరుతున్నారు.



మార్కెట్ సముదాయం

కాలువల ఆక్రమణ పరిశీలన

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీలోని కోదండరామవీధి సమీపంలో గల 49/1 ఆర్ సాగు నీటి కాలువపై ఆక్రమణలను అధికారులు సోమవారం పరిశీలించారు.

గోపినాథపురం గ్రామానికి ఆనుకుని ఉన్న సుమారు 153 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందజేస్తున్న కాలువను కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించారని రైతులు ఆర్డీవోకు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో సర్వే అధికారులు, రైతులంతా సాగు నీటి కాలువను పరిశీలించి ఆక్రమణలు తొలగించారు.

డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా రేపు

ఇచ్ఛాపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల ఏడో తేదీన పాక్స్‌కాన్ మాన్‌ప్యాక్చరింగ్ కంపెనీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల జాబ్‌డ్రైవ్ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇంజినీరింగ్, డిగ్రీ, డిప్లమో, ఐటీఐ అర్హత కలిగి 18 నుంచి 26 సంవత్సరాల్లోపు గల యువతీ యువకులు అర్హులన్నారు. మరిన్ని వివరాల కోసం 72045 12151 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అత్యవసరంగా గుంతలు పూడ్చాం

- ఆర్ అండ్ బీ శాఖ పర్యవేక్షక ఇంజినీరు

కంచిలి: మండల కేంద్రం కంచిలి పాత జాతీయ రహదారిని 209–2 నుంచి 212–2 వరకు ఉన్న రోడ్డును స్థానిక ఎమ్మెల్యే సూచనల మేరకు పట్టణంలో పండుగుల దృష్ట్యా అత్యవసర ప్రాతిపదికన గుంతలు లేకుండా మరమ్మతులు చేపట్టామని జిల్లా ఆర్ అండ్ బీ శాఖ పర్యవేక్షక ఇంజినీరు కె.జాన్ సుధాకర్ తెలిపారు. 'ఇవేం మరమ్మతులు శీర్షికన 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి జిల్లా శాఖ కార్యాలయం స్పందించింది. సోంపేట కార్యాలయ ఇంజినీరు ఇచ్చిన నివేదిక మేరకు వివరణ ఇచ్చారు. సీఎంవో పనుల కింద ఇప్పటికే రోడ్డు పునరుద్ధరణ చేయటానికి నిధులు మంజూరు చేసినట్టు పేర్కొన్నారు. త్వరలోనే పనులను చేపట్టి నిర్ణీత సమయంలో పూర్తి చేస్తామన్నారు.

సారా ప్యాకెట్లతో వ్యక్తి అరెస్టు

కంచిలి: సారా కలిగి ఉన్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. ఎక్సైజ్ మొబైల్ పెట్రోలింగ్ సీఐ, సిబ్బంది కలిసి మండలంలోని ప్రధానపుట్టుగ గ్రామంలో సోమవారం జరిపిన తనిఖీల్లో అదే గ్రామానికి చెందిన ఖేత్రీ బిసాయి అనే వ్యక్తి నుంచి 50 సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే మరో 100 సారా ప్యాకెట్లను వదిలి పారిపోయిన సుఖదేవ్ బిసాయి మీద కేసు నమోదు చేశారు. వీరికి సారా సరఫరా చేసిన కాకర్లపుట్టుగ గ్రామానికి చెందిన కాకర్ల సోమేశ్వరరావుపై కూడా కేసు నమోదు చేశారు. దాడుల్లో మొబైల్ సీఐ జి.వి.రమణ, ఎస్ఐ జగన్నాథం, సిబ్బంది మార్కారావు, శివాజీ, భాను ప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

సోంపేట: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడ్డాడు. తురక శాసనం కూడలి వద్ద సోమవారం రాత్రి టాటా మ్యాజిక్, ద్విచక్ర వాహనం ఢీకోవడంతో ప్రమాదం జరిగింది. అంబుగాం గ్రామానికి చెందిన తాపీమేస్త్రి రాజు సోంపేటలో పని ముగించుకొని తన ఇంటికి అంబుగాంకి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. తురకశాసనం వచ్చేసరికి హరిపురం నుంచి సోంపేట వైపు వస్తున్న టాటా మ్యాజిక్ వాహనం ఎదురుగా ఢీకొట్టింది. దీంతో మేస్త్రి తుళ్లి ముళ్లపొదల్లో పడిపోయాడు. స్థానికులు అతన్ని హరిపురం ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

అసిరిపోలమ్మ ఆలయ వార్షికోత్సవం

కవిటి: బొరివంక గ్రామదేవత అసిరిపోలమ్మ అమ్మవారి ఆలయం 13వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు అధికసంఖ్యలో సామూహిక కుంకు మార్చనల్లో పాల్గొన్నారు. గ్రామసర్పంచ్ బెందాళం శ్రీరాంప్రసాద్, ఉదయశ్రీ దంపతులచే అమ్మవారికి ప్రధాన పూజ చేశారు. లోకకల్యాణార్థం శాంతిహోమం నిర్వహించారు. పలువురు కళాకారులను సత్కరించారు.

జోగిపోలమ్మ సంబరం ప్రారంభం

టెక్కలి: పరశురాంపురంలో సోమవారం నుంచి ఘనంగా జోగిపోలమ్మ సిరిమాను సంబరం ఆరంభమైంది. అమ్మవారి ఆలయం నుంచి ఊరేగింపుగా దేవరను తీసుకువచ్చి ప్రతిష్టించారు.

జాబ్‌మేళాలో 15 మంది ఎంపిక

ఇచ్ఛాపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జాబ్‌మేళా నిర్వహించారు. దివీస్ కెమికల్స్ కంపెనీ సౌజన్యంతో నిర్వహించిన జాబ్‌మేళాలో 15 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రబీన్‌కుమార్ పాఢీ తెలిపారు. కంపెనీ హెచ్ఆర్ సీహెచ్ పూర్ణచంద్రరావు, జాబ్‌డ్రైవ్ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం నూతన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కళాశాలకు చెందిన అధ్యాపకులు వి.గోపాల కృష్ణ, డి.విష్ణుమూర్తి, కె. వేణుగోపాల్ రచించిన ఎకనమిక్స్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్స్ ఫర్ ఇంజినీర్స్ అనే అంశంపై వ్రాసిన పుస్తకాన్ని కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డి.శ్రీరాములు, బి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. –టెక్కలి

మజ్జిగ పంపిణీ



పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పాతజాతీయ రహదారిలోని ప్రశాంతి సాయి అనాథ పిల్లల వసతి గృహం వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించారు. సోమవారం చల్లని మజ్జిగను వాహన, పాదచారులకు పంపిణీ చేశారు.

–కాశీబుగ్గ

విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలి

- ఏపీటీఎఫ్ ప్రతినిధుల డిమాండ్



టెక్కలి: ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు



ఇచ్ఛాపురం రూరల్: డీటీకి వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు



సోంపేట: తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సంఘ ప్రతినిధులు

టెక్కలి: విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం టెక్కలి తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ధర్నా నిర్వహించారు. టెక్కలి, సంతబొమ్మాళి, నందిగాం మండలాలకు చెందిన ఉపాధ్యాయులు ధర్నాలో పాల్గొన్నారు. ఇన్‌చార్జి తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ నెల 9న జిల్లా కేంద్రం, 14న విజయవాడలో జరగనున్న ధర్నాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతినిధులు శ్రీనివాసరావు, బాబూరావు, శ్రీనివాసరావు, మల్లేశ్వరరావు, చంద్రశేఖర్, శివప్రసాద్, మోహన్ రావు, జి.ధనుంజయ్‌రెడ్డి, సూర్యనారాయణ, అనురాధ, తాతమనాయుడు, శంకరరావు ఉన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ సభ్యులు ధర్నా చేసి విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. 117 జీవో రద్దు విషయంలో ప్రభుత్వ పోకడలు 8 నుంచి 9 రకాల పాఠశాలలు ఏర్పాటు చేసి ప్రభుత్వ విద్యకు తూట్లు పొడిచే విధంగా ఉందన్నారు. పాత పింఛన్ విధానం అమలు చేసి సీపీఎస్, జీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉప తహసీల్దార్ బి.శ్రీహరికి వినతిపత్రం అందజేశారు. ఏపీటీఎఫ్ 257 జిల్లా కార్యదర్శి ఎస్.చాణిక్య, ఇచ్ఛాపురం ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, కవిటి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రుంకు కృష్ణారావు, గార రాంబాబు, పి.వేణుగోపాలరావు, ఏడుకొండలు, లక్ష్మీనారాయణ, పాపారావు, యశోద, సరోజని, పద్మావతి, రవికుమార్ పాల్గొన్నారు.

సోంపేట: ప్రాథమిక పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు తరగతులు కొనసాగించాలని, ప్రాథమిక పాఠశాలలకు పూర్వ ప్రాథమిక విద్యను అనుసంధానం చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ప్రాథమికోన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు కొనసాగించాలని, ఉన్నత పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులు, పీడీ పోస్టులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ బి.అప్పలస్వామికి వినతిపత్రం అందజేశారు. సంఘ జిల్లా ఉపాధ్యక్షులు జి.భీమారావు, రాష్ట్ర కౌన్సిలర్ జి.రాజేష్, సోంపేట, కంచిలి మండలాల ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్లు వేశారు.. బెర్మ్‌లు మరిచారు!



బెర్మ్‌లు లేకుండా ఉన్న ఈదుపురం సత్యసాయి కాన్వెంట్ వెనుక సీసీ రోడ్డు

ఇచ్ఛాపురం రూరల్: గ్రామాలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉపాధి హామీ పథకం నిధులతో పల్లె పండగ పేరుతో పలుచోట్ల హడావుడిగా సీసీ రోడ్లు వేశారు. కానీ వెండర్ల నిర్లక్ష్యం, నిర్వాహణ లోపం, అధికారుల పర్యవేక్షణ లేమితో ప్రజలకు కష్టాలు తప్పలేదు. రోడ్లు వేసినప్పటికీ బెర్మ్‌లు ఏర్పాటు చేయలేదు. దీంతో రోడ్లు ఎన్నాళ్లు ఉంటాయో తెలియని పరిస్థితి. ఇచ్ఛాపురం మండలంలో 143, సోంపేట మండలంలో 162, కవిటి మండలంలో 180, కంచిలి మండలంలో 140 రోడ్లు వేశారు. బిల్లులు వస్తున్నాయనే ఆశతో కూటమి నాయకులు ఆదరాబాదరాగా రోడ్లయితే వేశారు గానీ.. సకాలంలో బిల్లులు మంజూరు కాకపోవడంతో వెండర్స్ బెర్మ్‌లు వేయడం మానేశారు. దీంతో ప్రమాదాలను ఎదుర్కోవలసి వస్తుందని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీసీ రోడ్లు వేసిన వెంటనే ఇరువైపులా బెర్మ్‌లు వేయాల్సి ఉంది. అందుకు ప్రభుత్వం నిధులు కూడా మంజూరు చేస్తుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం అడపా దడపా వర్షాలు కురుస్తుండటంతో ఇప్పటికే సీసీ రోడ్లు కోతకు గురౌతున్నాయి. భారీ వర్షాలు కురిస్తే లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన రోడ్లు పాడైపోవడం ఖాయమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే బెర్మ్‌లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



దొంకూరులో ఇలా..



మధ్యపుట్టుగ గ్రామంలో ఇలా..



పి.శాసనాంలో బెర్మ్‌లు లేని రోడ్డు

చర్యలు చేపడతాం

సీసీ రహదారులకు బెర్మ్‌ల ఏర్పాటుకు నిధులు కేటాయించాం. రహదారులకు తప్పనిసరిగా బెర్మ్‌లు పోయాలి. నూతనంగా నిర్మిస్తున్న అన్ని సీసీ రహదారులకు ఇరువైపులా బెర్మ్‌లు వేసేలా చర్యలు చేపడతాం.

– కె.రమేష్, పీఆర్ ఏఈ, ఇచ్ఛాపురం, సోంపేట, పి.ప్రవీణ్ కుమార్ పీఆర్ ఏఈ, కంచిలి, కవిటి